# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 15-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- శాంతి, పురోగతి, శ్రేయస్సు కోసం భారత్.. ప్రపంచ వేదికపై ఒక బలమైన స్వరంగా ఎదుగుతోందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు.

- రక్షణ రంగంలో స్వయం సమృద్ధికి సాయుధ దళాలు, పరిశోధన అభివృద్ధి సంస్థలు, పరిశ్రమల మధ్య అనుసంధానం ఎంతో కీలకమని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

- సుస్థిర అభివృద్ధిలో భాగంగా సర్క్యులర్ ఎకానమిని ప్రోత్సహించడానికి భారత్ కట్టుబడి ఉందని కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ తెలిపారు.

- ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా భారత్-అఫ్గానిస్థాన్ జట్ల మధ్య రెండో టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

శాంతి, పురోగతి, శ్రేయస్సు కోసం భారత్.. ప్రపంచ వేదికపై ఒక బలమైన స్వరంగా ఎదుగుతోందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఢిల్లీలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ వరల్డ్ అఫైర్స్ (ICWA) రజతోత్సవ వేడుకలలో ఉపరాష్ట్రపతి ఈరోజు ప్రసంగిస్తూ... ప్రపంచం సంఘర్షణలు, వైరుధ్యాలతో సతమతమవుతున్న సమయంలో న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం విజయవంతమవడం ఒక మైలు రాయిగా నిలుస్తుందన్నారు. ప్రపంచ దేశాలు పరస్పర ప్రయోజనం కోసం కలసి పని చేసినప్పుడే మానవ పురోగతి, ప్రపంచ శాంతి సాధ్యమవుతాయని పేర్కొన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనకు ఐసీడబ్ల్యూఏ మేధోపరంగా, సంస్థాగతంగా సిద్ధం కావాలని, అంతర్జాతీయ వ్యవహారాల అధ్యయనానికి ప్రపంచంలోనే గౌరవనీయమైన కేంద్రాలలో ఒకటిగా ఎదిగేందుకు కృషి చేయాలని ఉపరాష్ట్రపతి అన్నారు. అనంతరం విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ మాట్లాడుతూ.. గ్లోబల్ సౌత్‌కు సంబంధించిన సవాళ్లతో సహా ప్రపంచ సవాళ్లపై

భారత్ తన దృక్పథాలను వివరిస్తోందన్నారు. దేశ ప్రయోజనాలు అంతకంతకూ ప్రపంచవ్యాప్తంగా మారాయని, దాని బాధ్యతలు పెరిగాయని, దానికి అనుగుణంగా భారతదేశంపై అంచనాలు కూడా పెరిగాయని జైశంకర్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించడానికి సాయుదదళాలు, పరిశోధన అభివృద్ధి సంస్థలు, పరిశ్రమల మధ్య అనుసంధానం ఎంతో కీలకమని ఆ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వేగవంతం చేయడానికి, భారతదేశ రక్షణ తయారీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆయా సంస్థల మధ్య పరస్పర సహకారం అవసరమని ఆయన పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన డీఆర్‌డీఓ-పరిశ్రమల సమన్వయ సమావేశం, `విమర్శ్ 2026`లో రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తూ... క్షిపణుల నుండి రాడార్ల వరకు, యుద్ధ విమానాల నుండి జలాంతర్గాముల వరకు, ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థ నుండి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వరకు ప్రతి రంగంలోనూ డీఆర్‌డీఓ తన సామర్థ్యాలను ప్రదర్శించిందన్నారు. గత కొన్నేళ్లుగా రక్షణ రంగంలో అనేక సంస్కరణలు చేపట్టామని, ఈ రంగంలో భారతదేశం దిగుమతులపై ఆధారపడకుండా.. స్వావలంబన వైపు పయనించేలా చూసేందుకే ఈ చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎంఎస్ఎంఈలను భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా అభివర్ణిస్తూ.. రక్షణ రంగంలో విడిభాగాలు, అనుబంధ వ్యవస్థలు, అత్యవసర సేవలలో వాటి సహకారం గణనీయమైనదని కేంద్రమంత్రి పేర్కొన్నారు. ఇక రక్షణ రంగంలో అంకుర సంస్థలు ముందడుగు వేస్తున్నాయని రాజ్‌నాథ్ సింగ్ వివరిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఈరోజు జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. గొప్ప ఇంజనీర్లలో ఒకరైన విశ్వేశ్వరయ్య చేసిన సేవలను స్మరించుకోవడానికి, దేశాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్రను గౌరవించడానికి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 15న ఈ దినోత్సవాన్ని జరుపుకుంటాం. విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు నివాళులర్పించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఒక మేధావి అని, దేశ నిర్మాణంపై ఆయనకున్న దార్శనికత పౌరులకు స్ఫూర్తినిస్తూనే ఉందని సామాజిక మాధ్యమ పోస్ట్‌లో ప్రధానమంత్రి పేర్కొన్నారు. మెరుగైన భవిష్యత్ కోసం నిర్మాణం, ఆవిష్కరణలు, పరిష్కారాలను అందించడంలో ఇంజనీర్లు చేసిన కృషికి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. విశ్వేశ్వరయ్య జీవితం శ్రేష్ఠత, క్రమశిక్షణ, ఆవిష్కరణ, ప్రజా సేవకు శాశ్వత ఉదాహరణగా నిలుస్తుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. జాతి నిర్మాణ ప్రయాణానికి ఆయన చేసిన అసాధారణమైన కృషి ఎల్లప్పుడూ గుర్తుండిపోతుందని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సుస్థిర అభివృద్ధిలో భాగంగా సర్క్యులర్ ఎకానమిని ప్రోత్సహించడానికి భారత్ కట్టుబడి ఉందని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ తెలిపారు. గాంధీనగర్‌లోని మహాత్మా మందిర్‌లో ఈరోజు జరిగిన 10వ `వరల్డ్ సర్క్యులర్ ఎకానమీ ఫోరమ్` (WCEF)-2026 లో ఆయన ప్రారంభోపన్యాసం చేస్తూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం పునర్వినియోగం, పరిరక్షణ వంటి ప్రాచీన పద్ధతులను సమకాలీన విధానాలుగా మార్చుకుందని తెలిపారు. విస్తరించిన ఉత్పత్తిదారు బాధ్యత (EPR) నిబంధనలు, మిషన్ లైఫ్ వంటి కార్యక్రమాలు సర్క్యులర్ ఎకానమి లక్ష్యాలను చేరుకోవడంలో కీలకమైన అడుగులని కేంద్రమంత్రి ఉద్ఘాటించారు. బ్రిక్స్ న్యూఢిల్లీ డిక్లరేషన్, భారత్-ఈయూ సంయుక్త ఫ్రేమ్‌వర్క్, మిషన్ లైఫ్ వంటి కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షులు షీ జిన్‌పింగ్‌ల మధ్య జరిగిన సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. న్యూఢిల్లీలో ఆ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఆ సమావేశంలో ప్రధానమంత్రి భారతదేశ అందోళనలను ప్రస్తావించారని చెప్పారు. పరస్పర గౌరవం, ప్రయోజనం, సున్నితత్వం అనే మూడు సూత్రాల ఆధారంగా ఈ సమస్యలు పరిష్కారంకావాలని ఆయన సూచించారని రణధీర్ జైస్వాల్ తెలియజేస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

యమునా నది పునరుజ్జీవనం కోసం ఉద్దేశించిన కిషౌ బహుళార్ధసాధక డ్యామ్ ప్రాజెక్ట్ ఒప్పందంపై ఆరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈరోజు సంతకాలు చేశారు. ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందపై న్యూఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమక్షంలో ఈరోజు సంతకాలు జరిగాయి. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత ఈ సంఘటన చరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కిషౌ ప్రాజెక్ట్‌ను జాతీయ ప్రాజెక్ట్‌గా ప్రకటించిందని చెప్పారు. దీని ఆర్థిక భారాన్ని సుమారు 90 శాతం కేంద్ర ప్రభుత్వం భరించగా, మిగిలిన 10 శాతాన్ని ఆయా రాష్ట్రాలు భరిస్తాయని అమిత్ షా తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా భారత్ - అఫ్గానిస్థాన్ జట్ల మధ్య రెండో టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్ ప్రారంభించిన అఫ్గానిస్థాన్ 15 ఓవర్లు పూర్తయ్యే సరికి 4 వికెట్ల కోల్పోయి 105 పరుగులు చేసింది. మూడు టీ-20ల సిరీస్‌లో ఇప్పటికే భారత్ 1-0 తేడాతో ఆధిక్యంలో ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

హర్యానా, పంజాబ్, తమిళనాడు, ఢిల్లీ, కర్ణాటక, పుదుచ్చేరి, కేరళం, ఉప హిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కిం, అస్సోం, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ రాష్ట్రాల్లో ఈరోజు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలిపింది. అలాగే రాబోయే రెండు మూడు రోజుల్లో అండమాన్ నికోబార్ దీవులు, బీహార్, జమ్మూ కాశ్మీర్, లడఖ్, జార్ఖండ్, ఒడిశా, రాజస్థాన్‌లలో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. రానున్న రెండు రోజుల వరకు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, తెలంగాణ, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో కూడా ఇలాంటి పరిస్థితులే కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. ఇక రేపటి వరకు అరేబియా సముద్రంలోకి, అలాగే శనివారం వరకు నైరుతి దిశకు ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాల్లోకి మత్స్యకారులు వేటకు వెళ్లరాదని ఐఎండీ సూచించింది. అలాగే శనివారం వరకు బంగాళాఖాతంతో పాటు అండమాన్ సముద్రంలోకి కూడా వెళ్లవద్దని సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74 వేల 781 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 778 పాయింట్ల నష్టంతో 74 వేల 003 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 279 పాయింట్లు నష్టపోయి 23 వేల 118 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95 రూపాయల 96 పైసలుగా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =